ఓం నమోభగవతే శ్రీరమణాయ



# రమణ భాస్కర



సంపుటి : 7 సంచిక : 21 పుష్పం : 58-60 20-07-2002

**RAMANA BHASKARA**

**TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE**

PAGES : 24

**VOL : 7** **ISSUE : 21**

EDITOR
**P.S. RAMA RAJU**

EDITING
**P.H.V. SATYAVATHI**
(HYMA)

**SUBSCRIPTION**
Yearly : **Rs. 150/-**
Each Copy : **Rs. 8/-**

**ADDRESS**
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETRAM
**JINNURU - 534 265**
W.G.Dt., A.P.

**PUBLISHER**
P.S. RAMARAJU
LAKSHMI MODERN RICE MILL
**ULLAMPARRU - PALAKOL**
☎ 08814 - 24589, 24689

**PRINTER**
SHRIRAM GRAPHICS
BANK STREET - **PALAKOL**
☎ 08814 - 22438, 24278


## పుణ్యఫలమే గురు వైభవాన్ని గుర్తింపజేస్తుంది

జనన మరణ చక్రబంధంనుండి ఈశ్వరుడు మనలను విముక్తి కలిగించాలి అని తలపెట్టినప్పుడు అతడే సద్గురువు రూపంగా మనకు తెలియబడతాడు. మన తెలివి తేటల వల్ల గురువు వద్దకు వెళ్ళటంలేదు. ఆయన ప్రేరణ వల్లనే మనం వెడతాము. గురు పరంపర తప్ప "ముక్తి" సాధ్యంకాదనేది ఆ పరమేశ్వరుని నియమం. ముల్లోకాల్లో కార్యక్రమాలను ఏర్పాటు చేసే "శక్తి" ఆ గురువు ఆధీనంలో ఉంటుంది. సీముతో రసికారే బాధామయమైన పుండును, డాక్టరు చెడును తొలగించి, శుభ్రం చేసి నయం చేసేకాలంలో రోగి ఏడుపు పెడబొబ్బలను డాక్టరు పట్టించుకోడు అతని రోగనివారణే, అతని దృష్టి పదంలో ఉంటుంది. అలాగే దుఃఖ సాగరంలో కొట్టుమిట్టాడే శిష్యులను "సుఖి"ని చెయ్యటానికై ప్రవచనాల ద్వారా హితవుగా చెబుతారు. దాన్ని గ్రహించి ఆచరించలేనప్పడు ప్రత్యక్ష చర్యగా అతని కర్మల చిట్టాలోనివి కొన్నింటిని తీసి ఆయా రోగ నివారణలకు అనుభవింపజేస్తారు. దీనినే పెద్దలు "ప్రతీమానవచరిత్ర భగవంతుడు తన స్వహస్తాలతో వ్రాయబడ్డ అద్భుతగాధ" అంటారు. చాకలి బట్టలను రాతిపై బాదటం వాటిపై కసికాదు మురికి వదిలించి, శుభ్రం చెయ్యటానికే. దారిద్ర్యం - నష్టాలు - రోగాలు - అపనిందలు, మనిషికి క్రమశిక్షణ యిచ్చి మనసును భగవంతునివైపు మళ్ళిస్తాయి. అట్టి స్థితిలో కూడా శిష్యుడు గురువు ఎడ అపరిమితమైన అచెంచలమైన విశ్వాసం కలిగి ఆయనకు అర్పణం గావించుకోవాలి. మనః పూర్వకంగా సేవించాలిగాని, విముఖిత పనికిరాదు - కారణం ఆయన చేసే మేలు మన బుద్ధికి అందదు. గురువు కోపంకూడా అనుగ్రహమే అని గ్రహించిన సాధకులు ధన్యులు. "గురువు శాంతికి, సత్యానికి, జ్ఞానానికి నిలయాలు. ఇనుమును పరుసవేది తాకితే బంగారమైనట్లు వారు తమదివ్యత్వంతో మనలను పూరిస్తారు పాపాలను నాశనం చేసి పావనమూర్తిగా చేస్తారు. గురువే పుణ్యక్షేత్రం. పాపాలను కడిగే అమృత సరస్సు. గురువు మహోన్నత దైవం. దేవుళ్ళకు దేవుడు అంటారు గురు అర్జునదేవు. గురువు యొక్క వైభవాన్ని అర్థం చేసుకొన్న మానసమే సత్‌ఫలితాలను పొందుతుంది.

**సాగిరాజు రామకృష్ణంరాజు**
అర్థవరం

ఈ సంచికలో...... **సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు**


10-06-2002 హైదరాబాదు ........ 3
08-07-2002 దిండి ........ 10
14-07-2002 గుమ్మలూరు ........ 19


Visit us @ www.srinannagaru.com

# రమణభాస్కర

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 10-06-2002, హైదరాబాద్)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

పూజ, జపం, ధ్యానం ఇవి హిందూమతంలో సాంప్రదాయకంగా వచ్చేవి. భగవంతుని పాదాలను ధ్యానం చేయటం, ఆయన నామాన్ని జపించటం, ఆయన రూపాన్ని పూజించటం వీటిఅన్నింటియొక్క ప్రయోజనం మనస్సుకు పవిత్రత చేకూర్చటం. పవిత్రమైన మనస్సు స్వాధీనంలోనికి వస్తుందిగాని పవిత్రంకాని మనస్సు మన స్వాధీనంలోనికి రాదు. మన వాక్కులో దోషం ఉండకూడదు, మన చేతలో దోషం ఉండకూడదు, మన ఆలోచనలో దోషం ఉండకూడదు. వాక్కు, చేత, తలంపులు దోషపూరితంగా ఉంటే ఆ జీవుడిని అశాంతి, దుఃఖం వెంటాడుతాయి. అశుభకర్మలు తగ్గించుకొంటూ శుభకర్మలు పెంచుకొంటూ రావాలి. అశుభవాసనలు తగ్గించుకొంటూ శుభవాసనలు పెంచుకొంటూ రావాలి. ఆత్మవిచారణ, ధ్యానం, సత్పురుషుల సహవాసం వీటిఅన్నింటివలన ముందు మనిషిలో ఉన్న మూర్ఖత్వం తగ్గుతుంది. కేవలం చదువు వలన, ధనం వలన మూర్ఖత్వం తగ్గదు. మూర్ఖత్వం ఎప్పుడైతే తగ్గిందో అప్పుడు మనం వివేకంగా జీవించటానికి అలవాటుపడతాము. వివేకాన్ని నెమ్మదిగా పెంచుకొంటూ రావాలి. తపస్సు అంటే కేవలం శరీరాన్ని, ఇంద్రియాలను ఎండింపచేయటం కాదు, అహంభావరహితంగా జీవించటం తపస్సు అన్నారు భగవాన్. భక్తియోగం, జ్ఞానయోగం, కర్మయోగం ఇలా అనేక యోగాలు భగవంతుడు చెప్పాడు. దేహము నేను అనే తలంపునుండి విడుదలపొందటమే అన్నియోగములయొక్క లక్ష్యం. మీరు ఏదైనా మంచిమాటలు చదివినప్పుడు, మంచిమాటలు విన్నప్పుడు ఆ మాటలను మననం చేయాలి. ఆ మాటలను మననం చేయగా చేయగా మనస్సు అంతర్ముఖమవుతుంది. మనస్సు అంతర్ముఖమవ్వటం ప్రారంభించినప్పుడే మీకు సుఖం, శాంతి తెలుస్తుంది. మన మనస్సు సహజంగా లోకాన్ని, విషయాలను చింతిస్తుంది. ఆ విషయచింతనలోనుండి ఆత్మచింతనలోనికి, దైవచింతనలోనికి దానిని మళ్ళించటమే పూజ, జపం, ధ్యానం యొక్క ప్రయోజనం. విషయచింతన వలన మనస్సు బాహ్యముఖానికి వెళుతుంది. ఎప్పుడైతే బాహ్యముఖానికి వెళ్ళిందో అది దుఃఖపడుతుంది, నష్టపడుతుంది, కష్టపడుతుంది, దేహం మరణించిన తరువాత పాడులోకాలకు ప్రయాణం చేస్తుంది. చాలా జాగ్రత్తగా ఆలోచించుకోండి. మనస్సులోపలకు వెళితే సుఖం, శాంతి, ఆనందం, మోక్షం. మనస్సు బాహ్యానికి వెళితే దుఃఖం, వేదన, రోదన అంతేకాదు మనస్సు బయటకు వెళితే బంధం. మన దగ్గర ఎంత డబ్బు ఉంది అని చూసుకోవటంకాదు, సాధకుడు చూచుకోవలసింది ఏమిటి అంటే మనస్సు బయటకు వెళుతోందా, లోపలకు వెళుతోందా అని సాధనలో చూసుకోవాలి. రజోగుణం, తమోగుణం వేగం ఉన్నప్పుడు మనస్సు బాహ్యముఖానికి వెళుతుంది, సత్వగుణం ఉన్నప్పుడు మనస్సుకు అంతర్దృష్టి కలుగుతుంది. ప్రయత్నం చేసినా సత్వగుణం లేకుండా జ్ఞాన సముపార్జన సాధ్యం కాదు. సత్వగుణాన్ని సముపార్జించుకోవాలంటే సహనాన్ని, ఓర్పుని ప్రాక్టీసు చేయాలి.

దేహం ఎంత నిజమో, ఆ దేహానికి వచ్చే రోగాలు, దేహంతో అనుభవించే భోగాలు కూడా అంతే నిజం. ఇది అంతా స్వప్న సమానము. నీ దేహాన్ని ప్రారబ్దానికి విడిచిపెట్టి నువ్వు లోచూపు నేర్చుకో. ఏ సంఘటన జరిగినా దానితో తాదాప్యం చెందవద్దు. అలా తాదాప్యం చెందకుండా ఉంటే నీ మనస్సు వెళ్ళి హృదయగుహలో పడిపోతుంది. మనం చేస్తున్న సాధన మీద ముందు మనకు నమ్మకం ఉండాలి, విశ్వాసం ఉండాలి. మన మీద మనకు విశ్వాసం ఉంటేనే ఏదైనా సాధించగలము. విశ్వాసం చాలా ముఖ్యం. ఆత్మాన్వేషణ చేయాలనే కోరిక దైవకృప వలననే కలుగుతుంది. గాఢనిద్రలో అహంభావన లేదు కాని అక్కడ మనం ఉన్నాము అక్కడ ఉన్నస్థితికి, అహంభావనకు ఎట్టి సంబంధంలేదు. గాఢనిద్రలో ఏస్థితి అయితే ఉందో, ఏ ఆత్మ అయితే ఉందో అది జాగ్రదవస్థలో కూడా ఉంది. జాగ్రదవస్థలో నీవు ప్రయత్నం చేసి దానిని అనుభవంలోనికి తెచ్చుకోవాలి. అప్పుడు శాంతి, ఆనందం నీకు స్వరూపంగా వ్యక్తమవుతాయి. నీకు ఏ రూపంలో శాంతి వచ్చినా, సుఖం వచ్చినా అది ఆత్మలోనుండే వస్తుంది గాని బాహ్యపదార్థాలనుంచికాని, వస్తువులనుంచికాని సుఖం రావటంలేదు. బాహ్య పదార్థాల నుండి సుఖం వస్తున్నట్లు నీకు అనిపిస్తుంది కాని అది నిజంకాదు. చైతన్యానికి చావులేదు, పుట్టుకలేదు. అది మనమై ఉన్నాము. దేహభావనలో నుండి, రూపభావనలో నుండి, నామభావనలో నుండి ఎప్పుడైతే విడుదలపొందామో నది వెళ్ళి సముద్రంలో ఐక్యమైనట్లు నీవు చైతన్య స్రవంతిలో ఐక్యమవుతావు, ఆనంద ప్రవాహములో ఊగిసలాడతావు. చైతన్యం ఎప్పుడైతే అనుభవంలోనికి వచ్చిందో వాడికి దేహం జీవించటానికి, మరణించటానికి ఉన్న భేదం జారిపోతుంది. ఇప్పుడు మనం జీవించి ఉన్నాము అనుకొంటున్నాము. మరణించిన తరువాత ఎక్కడికో వెళ్ళిపోతాము అనుకొంటున్నాము. మరణం అంటే మనకు భయం వేస్తోంది

ఎందుకంటే మరణం తరువాత మనం ఉండము అనుకొంటున్నాము. అసలు మరణానికి, జీవించటానికి బేధం లేదు. బేధం లేదు అన్నవిషయం ఎప్పుడు అనుభవంలోనికి వస్తుంది అంటే నీ హృదయంలో ఉన్న చైతన్యం తానుగా నీకు వ్యక్తమయినప్పడు జీవితానికి, మరణానికి ఇసుమంతయు బేధం లేదన్న సంగతి నీకు అనుభవంలోనికి వస్తుంది. మనలను మనం పొగడుకోవటం, ఇతరులను నిందించటం ఇవి మనకు ఉన్న పెద్ద రోగాలు. ఈ రెండూ తగ్గించుకొంటే చైతన్యం అనుభవంలోనికి వస్తుంది. మిమ్మల్ని మీరు స్తోత్రం చేసుకొంటున్నారు అనుకోండి దేహము నేను అనే తలంపు పెరిగిపోతుంది, ఇతరులను విమర్శిస్తున్నారు అనుకోండి అప్పడు కూడా దేహమునేను అనే తలంపు పెరిగిపోతుంది. వీటివలన మనం ఈ భూమి మీదకు ఎందుకు వచ్చామో మర్చిపోతున్నాము. ఒక మనిషి ఎంత చెడ్డవాడైనా వాడిని ద్వేషించవద్దు అని భగవాన్ చెప్పారు. ఎందుచేతనంటే వాడిని ద్వేషిస్తూ ఉంటే మీ మనస్సు బాహ్యముఖానికి వెళ్ళిపోతుంది, మీరు నష్టపోతారు. మనం ఈశ్వరుడితో అనుబంధం పెంచుకోవాలి. ఈశ్వరచింతన వలన విషయచింతనలోనుండి విడుదల పొందుతాము. విషయచింతనలోనుండి ఎప్పడైతే విడుదల పొందామో మీ మనస్సు వెళ్ళి గూటిలో పడిపోతుంది. ఇది ధనంవలన, చదువు వలన వచ్చేదికాదు, బాహ్యమైన ప్రక్రియలవలన వచ్చేది కాదు. మన దైనందిన జీవితంలో వ్యక్తిభావన లేకుండా జీవించాలి. మన మాటలోగాని, చేతలోగాని వ్యక్తిభావన పెంచుకోకూడదు. బాహ్యంగా చేసే పనుల వలన నీకు పుణ్యం రావచ్చుగాని జ్ఞానం రాదు. జ్ఞానంవస్తే గాని శాంతిలేదు, సుఖంలేదు. మనం చేసేపని కర్తృత్వం లేకుండా చేయాలి. మీకు వ్యక్తిభావన ఉంటే మీరు అజ్ఞానంలో ఉన్నట్లే. ఏదో ఒక రూపంతోగాని, నామంతోగాని తాదాప్యం పొందుతూ ఉంటే మీరు అజ్ఞానంలో ఉన్నట్లు గుర్తు. దైనందిన జీవితంలో నీ ప్రవర్తన ఎలా ఉండాలి అంటే దేహబుద్ధి నశించేలా ఉండాలి. దేహబుద్ధి నశించినప్పడు నీకు శివబుద్ధి కలుగుతుంది. గురువు చెప్పిన మాటలను మననం చేస్తే, ఆ రకంగా జీవిస్తూ ఉంటే మనస్సు నశిస్తుంది. ఈశ్వరానుగ్రహం లేకుండా ఈశ్వరుని చింతించలేవు. మనం ఈశ్వరానుగ్రహం సంపాదించాలి. ధనం సంపాదిస్తే బజారులో ఉన్న వస్తువును కొనటం ఎంత తేలికో ఈశ్వరానుగ్రహం సంపాదిస్తే ఈశ్వరుని పొందటం కూడా అంతే తేలిక. ఈశ్వరానుగ్రహం సంపాదించిన తరువాత అనుగ్రహం మిమ్మల్ని ఆపరేట్ చేస్తుంది. ఎలా ఆపరేట్ అవుతోందో మీకు స్పష్టంగా గోచరిస్తూ ఉంటుంది. మనలను నడిపించేవాడు, మనలను అనుగ్రహించేవాడు, మనకు మోక్షం ఇచ్చేవాడు మన హృదయంలోనే ఉన్నాడు.

**20-07-2002**



కాని మనకు బయట ఉన్న దేవుళ్ళు అంటే ఇష్టం, నిజమైన దేవుడు అంటే మనకు ఇష్టంలేదు. నిజమైన దేవుడు మన హృదయంలోనే ఉన్నాడు. మనస్సు కల్పించిన దేవుళ్ళు అంటే మనస్సుకి ఇష్టంకాని నిజమైన దేవుడి దగ్గరకు అది వెళ్ళదు, అక్కడకు వెళితే అది ఉండదు అన్న సంగతి దానికి తెలుసు కాబట్టి దాని నాశనాన్ని అది కోరుకోదు. మనలోపల ఉన్న ఈశ్వరుడు ఎలా పని చేస్తున్నాడో అలా మనం పనిచేయటం నేర్చుకొంటే ఆయన అనుగ్రహం మన శిరస్సు మీద వర్షిస్తుంది. ఈశ్వరుడు రాగ ద్వేషరహితుడుగా ఉంటాడు, సమబుద్ధి కలిగి ఉంటాడు. మనం రాగద్వేషాలను విడిచిపెడితే వెంటనే మనస్సు వెళ్ళి గూటిలో పడిపోతుంది. మనస్సు దాని మూలాన్ని చూడకుండా అది నశించదు. నీవు ఏదో మార్గం ద్వారా ప్రయాణించి వైరాగ్యాన్ని పెంచుకొని మనస్సును దాని మూలంలోనికి పంపటానికి ప్రయత్నం చెయ్యి. మనో మూలంలోనే భగవంతుడు ఉన్నాడు. లోకం నిజం అనుకొన్నంత కాలం మనస్సు ఏదో రకంగా బయటకు వచ్చేస్తుంది. ఈ మనస్సు అనే బుజ్జిగాడిని మచ్చికచేసుకొని, దానితో విరోధం పెట్టుకోకుండా, దానిని నెమ్మదిగా విషయచింతనలోనుండి విడుదలచేసి హృదయంలో ఉన్న ఈశ్వరుడి చేతికి అందిస్తే ఆయన దానిని లోపలకు గుంజుకొంటాడు. లోపల ఉన్న ఈశ్వరుడి చేతికి అందివ్వటమే మీరు చేసేపని. లోపల ఉన్న గురువు నీ మనస్సును లోపలకు గుంజుకొని ఆయన స్వరూపాన్ని నీకు ఇస్తాడు. అదే మోక్షం, అదే శాంతి, అదే ఆనందం. అప్పడు పరిమితులు లేని ఆనందంలో, స్వతంత్రమైన ఆనందంలో నీవు ఊగిసలాడతావు. అప్పడు నీకు లోకం కనిపించినా, కనిపించకపోయినా ఈ దేహం ఉన్నా, లేకపోయినా ఒక్కటే. అప్పడు వీటి అన్నింటికి నీవు అతీతంగా ఉంటావు. మన మనస్సులో దోషం ఉంటే గురువు చెప్పిన దానిని మన మనస్సు రిజెక్టు చేస్తుంది. ఆధ్యాత్మిక సాధన అంటే ఇతరులతో చేసే యుద్ధంకాదు, నీ మనస్సుతో నీవు చేసే యుద్ధం. ఒక వెయ్యి మందిని కత్తి పుచ్చుకొని చంపవచ్చు. ఇది తేలిక కాని మనస్సును నిగ్రహించుకోవటం చాలా కష్టం. మనోనిగ్రహం కష్టం, వివేకాన్ని కాపాడుకోవటం కష్టం అందుకు బహుజాగ్రత్తగా జీవించాలి. అజాగ్రత్త, అవినయం పనికిరాదు. దేశభక్తి వలన హృదయం విశాలమవుతుంది. హృదయం విశాలమయ్యే కొలది దేహం నేను అనే తలంపు దానంతట అదే అదృశ్యమవుతుంది. మనం సబ్జక్టును నేచురల్‌గా అవగాహన చేసుకొంటూ ఉంటే, ఆరకంగా జీవిస్తూ ఉంటే దేహము నేను అనే తలంపుకు నేచురల్‌గా డెత్ వచ్చేస్తుంది. అవగాహన కూడా యోగంతో సమానము. నీకు ఈశ్వరానుగ్రహం లేకపోతే,

**రమణ భాస్కర**

ఆయన దయ లేకపోతే జ్ఞానం సంపాదించాలి, సత్పురుషులతో సహవాసం చెయ్యాలి, మనకు తెలిసిన మంచిని ఇతరులకు బోధించాలి అనే బుద్ధి నీకు కలుగనే కలుగదు. నువ్వు సక్సెస్ అవ్వాలంటే స్వప్రయత్నం, కాల పరిపక్వం, ఈశ్వర కటాక్షం ఇవి మూడు అవసరం. నీ ప్రయత్నం నీవు చేయాలి, కాలం కలసి రావాలి, ఈశ్వరుడు అనుగ్రహించాలి. ఈ మూడు కలిసివస్తేనే ఆధ్యాత్మికంగా, భౌతికంగా కూడ ఆ పని సక్సెస్ అవుతుంది.

నీ తెలివి, నీ సాధన సరిపోదు. నువ్వు ఎవరినైతే పొందుదామని అనుకొంటున్నావో ఆయన అనుగ్రహం లేకుండా ఆయనను పొందలేవు. ఆయన అనుగ్రహం ఎలా వస్తుంది అంటే దైనందిన జీవితంలో మన ప్రవర్తనను బట్టి వస్తుంది. ఆధ్యాత్మిక జీవితం అంటే నన్ను నేను చంపుకోవటం అంటే దేహగతమైన నేనును చంపుకోవటం, ఇతరులను చంపటంకాదు. శరణాగతి వలన దేహగతమైననేను నశిస్తుంది. నీవు ఏదైనా మంచిచేస్తే, నీకు మంచి తలంపులు వస్తే ఇది అంతా ధనం క్రింద మారిపోయి ఈశ్వరుడి బాంక్‌లో ఉంటుంది. ఇక్కడ బాంక్‌లో మనం దాచుకొన్న డబ్బు మరణానంతర జీవితంలో చెల్లుబాటుకాదు. ఈశ్వరుడి బాంక్‌లో ఉన్న డబ్బు మరణానంతర జీవితంలో నీకు ఉపయోగపడుతుంది. అందువలన ప్రతీవాడు ఈశ్వరుడి బాంక్‌లో కొంత సొమ్ము వేసుకోవాలి. ఈశ్వరానుగ్రహం ఒకప్పుడు ఉండి, ఒకప్పుడు లేదు అనుకొంటున్నారేమో అనుగ్రహం ఎప్పుడూ ఉంది. ఆ ఉన్నది మీ చేతికి అందుకోవటానికే మీరు చేసే ప్రయత్నం. అనేక జన్మల నుండి నీవు ఆరాధించగా, ఆరాధించగా భగవంతుడే గురురూపంలో వస్తాడు. ఆయన నీ పట్ల దయచూపించి నీ మనస్సుకు లోచూపు కలుగజేస్తాడు, నీకు సత్వగుణాన్ని పెంచుతాడు, దేహాభిమానంలోనుండి నిన్ను విడుదల చేస్తాడు. ఇదంతా గురువు చేసేపని. మీకు సత్యానుభవం కలిగితేనేగాని మీరు బంధంలోనుండి, అజ్ఞానంలోనుండి విడుదల పొందలేరు. అజ్ఞానంలో నుండి విడుదల చేయలేని తల్లి తల్లికాదు, అజ్ఞానంలోనుండి విడుదల చేయలేని తండ్రి తండ్రికాదు, అజ్ఞానంలో నుండి విడుదల చేయలని గురువు గురువుకాదు. నీ మనస్సును అంతర్ముఖం చేయకుండా, దానిని బాహ్యముఖం చేసేవాడు గురువుకాదు వాడు రాక్షసుడు అని చెప్పారు. ప్రాపంచిక విషయాలలో అతిగా ఉండవద్దు. దేవుడికి దగ్గరగా ఉండండి, విషయాలకు దూరంగా ఉండండి. మీ దేహయాత్రకు సరిపడ లోకంతో సంబంధం పెట్టుకోండి. లోకాన్ని ఉద్ధరిస్తాము అనుకోవద్దు. మిమ్మల్ని మీరు ఉద్ధరించుకోండి అప్పుడు మీ ద్వారా లోకం ఎంతోకొంత ఉద్ధరింపబడుతుంది. మిమ్మల్ని మీరు ఉద్ధరించుకోవటం మానివేసి లోకాన్ని ఉద్ధరిస్తాననటం అది ఆత్మవంచన. మనం పుస్తకాలు చదివిన దానికంటే మన మనస్సును బాగా చదువుకొంటే ఎక్కువ పాఠాలు నేర్చుకోగలం. మనస్సును చదవటం నేర్చుకొంటే మనలో ఏమి దోషాలు ఉన్నాయి, వేటిని మనం తొలగించుకోవాలి అనే అవగాహనకు మనం రాగలుగుతాము. లోకంతో అతిగా సంబంధం పెట్టుకొంటే మానసిక జ్వరం పెరుగుతుంది. శరీరానికి జ్వరం ఉంటే నోటిలో ఏది పెట్టుకొన్నా చేదుగా ఉంటుంది అలాగే మనస్సులో జ్వరం ఉంటే దేవుడు చెప్పినమాట చేదుగా ఉంటుంది, మంచివారు అందరూ చెడ్డవారుగా కనబడతారు. శారీరక జ్వరం స్మశానంలో కాలిపోతుందిగాని మానసికజ్వరం జన్మజన్మలకు మనలను వెంటాడుతుంది. నీకు మానసిక జ్వరం తగ్గాలంటే ఒకటే మందు సత్పురుషులతో సహవాసం చేయాలి. మనకు పుణ్యబలం లేకపోతే సత్పురుషులతో సహవాసం దొరకదు. సజ్జన సాంగత్యంలో సర్జరీ జరుగుతూ ఉంటుంది, సాధన చేస్తున్నట్లు నీకు తెలియకుండా సాధన చేసేస్తావు, సత్పురుషుల సహవాసం అటువంటిది. అటువంటి వారితో సహవాసం విడిచిపెట్టవద్దు. వారు నిన్ను ఎంత దూరం తీసుకొనిపోతారు అంటే పునర్జన్మ హేతువులను ఊడగొట్టటమే కాదు, నీ శరీరం ఈ భూమి మీద తిరుగుతున్నప్పడే నీలోపల ఉన్న సద్వస్తువుతో అనుబంధం కలుగజేసి ఆత్మసుఖాన్ని, ఆనందాన్ని అనుగ్రహిస్తారు. ఈ భూమి మీద ఉండగానే ముక్తి సుఖాన్ని, పరిమితులు లేని సుఖాన్ని కలుగజేస్తారు. నువ్వు ఏదైతే పొందాలి అనుకొంటున్నావో దానిని ఈ జన్మలోనే పొందవచ్చు. రేపు రేపు అనుకోవద్దు, రేపుకు రూపు లేదు. అది సోమరితనానికి గుర్తు. ఏ రోజు చేసే సాధన ఆరోజు చెయ్యి. ఈశ్వరుడు ఉన్నాడు అని సజీవమైన విశ్వాసంతో, సిన్సియర్‌గా సాధన చెయ్యి. దైనందిన జీవితంలో నీ మాటలోగాని, పనిలోగాని కపటంలేకుండా చూసుకో. ఈశ్వరానుగ్రహం సంపాదించటానికి అనుగుణంగా పనిచేసుకో. ఆయన అనుగ్రహం లేకుండా ఆయనను పొందలేము. మనకు అర్హత, యోగ్యత వస్తోంది అనుకోండి, మనస్సుకు పవిత్రత వస్తోంది అనుకోండి మోక్షంకావాలి అని మనం అడగనక్కరలేదు, ఆయన అంతట ఆయనే మోక్షాన్ని ప్రసాదిస్తాడు. మనకు అర్హత లేనప్పుడు అడిగినా ఇవ్వడు. నువ్వు నదులలో స్నానం చేయవచ్చు, గుడికి వెళ్ళి విగ్రహాన్ని ఆరాధించవచ్చు. సజ్జన సాంగత్యం ముందు ఇవి అన్నీ సెకండరీ. నీ హృదయంలో ఒక నిజం ఉంది. ఆ నిజం ఉందనే సంగతి నీకు తెలియటంలేదు. నీ హృదయంలో నిజం ఉంది అనే స్ఫూర్తిని నీకు కలుగజేసి, అది నీకు అనుభవంలోనికి వచ్చే వరకు నిన్ను వెంటాడుతాడు వాడు గురువు. జ్ఞాని మౌనం అన్నింటికంటే శక్తి వంతమైనది.

జ్ఞానియొక్క మౌనం నీకు మారుమనస్సును తీసుకొనివస్తుంది, నీ మనస్సుకు పవిత్రత చేకూరుస్తుంది. జ్ఞాని యొక్క మాట, చూపు, కదలిక, చేత అన్నీ అనుగ్రహమే, ఆయన శరీరం ధరించటమే అనుగ్రహం. మీకు ఇష్టమైన మార్గంలో ప్రయాణం చెయ్యండి. శివ, కేశవ బేధం లేదు ఈ శరీరం ఉండగానే శరీర రహితస్థితిని, అహంభావరహితస్థితిని పొందండి. భగవంతుడు మీకు ఇచ్చిన అవకాశములను ఉపయోగించుకొని, ఈ దేహాన్ని, మనస్సును మేగ్జిమమ్ ఉపయోగించుకొని ఈ శరీరానికి మరణం రాకముందే మరణంలేని వస్తువును పొందండి.

**అమ్మలార వినరే! ఓ......**<br>
**అయ్యలార కనరే!**<br>
**అమ్మలార॥**

**తొలిజన్మంబుల చేసిన పుణ్యము**<br>
**ఫలియించెను మన కనులముందరే!**<br>
**అమ్మలార॥**

**పావనమగు జిన్నూరు క్షేత్రమున**<br>
**పరమహంస నడయాడు చుండెనట!**<br>
**అమ్మలార॥**

**వేద తరువునకు కాసిన పండట,**<br>
**మోదమలర మన చేతి కందెనట!**<br>
**అమ్మలార॥**

**మన హృదయమ్ముల గగన తలమ్మున**<br>
**నెనరుతో తిరిగెడి జ్ఞాన చంద్రుడట!**<br>
**అమ్మలార॥**

**అరుణాచలునకు ప్రియతనయుండట**<br>
**కరుణతో కాచెడి గురుగుహుడేనట!**<br>
**అమ్మలార॥**

**- R.A.** నాయక్





# రమణభాస్కర

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 08-07-2002, దిండి)**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

సత్వగుణం ఉన్నవాడు భౌతికంగాను, ఆధ్యాత్మికంగాను అభివృద్ధిలోనికి వస్తాడు. సత్వగుణం ఉన్నవాడికి ఉద్రేకం తక్కువగా ఉంటుంది, ఆలోచన ఎక్కువ ఉంటుంది. సత్వగుణం ఆలోచన యొక్క లోతులు పెంచుతుంది. సత్వగుణం ఉన్నవాడు తన బుద్ధిని బాగుచేసుకొంటాడు, బుద్ధిని శుద్ధిచేసుకొంటాడు. రజోగుణం, తమోగుణంలో ఉన్నవారు అల్లరి, ఆందోళన, డాంబికంగా మాట్లాడటం తప్ప పని సున్న. మన శరీరానికి మరణం వచ్చేలోపు బుద్ధిని శుద్ధి చేసుకోవాలి. ప్రపంచంలో ఏమీలేదు, ఏదో ఉందని మనకు అనిపిస్తుంది. అదేమాయ, అదే భ్రాంతి. మనకళ్ళకు కనిపిస్తున్న ఈ ప్రపంచంలో సారవంతమైనది ఏదీ లేదు, అంతా నిస్సారమే. ఉన్నదేదో అది మన హృదయలోనే ఉంది, అది మనమై ఉన్నాము. అది మనకు అనుభవంలోనికి వచ్చేవరకు జీవుడియొక్క యాత్రను ఎవరూ ఆపుచేయలేరు, వాడు ఎంతటివాడైనా ఈజననమరణములను ఎవరూ ఆపలేరు, ఈ ప్రకృతి గుణాలను దాటలేరు. లతామంగేష్కర్‌ను మీరు ఎందుకు పెళ్ళి చేసుకోలేదు అని అడిగితే అది దేవుని దయ అని చెప్పింది. నాకు పెళ్ళి అయిఉంటే అది దేవుని దయ, పెళ్ళి అవ్వకపోవటం కూడా దేవుని దయ. దేవుని దయ లేకుండా, ఆయనకు తెలియకుండా ఈ సృష్టిలో ఏదీ జరుగదు అని చెప్పింది. మీకు ఏమైనా కోరికలు ఉన్నాయా అని అడిగితే ఉన్నాయి అని చెప్పింది. ఏమిటి అని అడిగితే మరల నాకు శరీరం రాకూడదు, పునర్జన్మరాకూడదు ఈ కోరికమటుకు నాకు ఉంది, ఈ లోకంలో కోరుకోవలసినది ఏదీ నాకు కనబడటంలేదు అని చెప్పింది. పరిస్థితులు మనకు అనుకూలంగా ఉంటే అది దేవుని దయ అనుకొంటాము. పరిస్థితులు మనకు ప్రతికూలంగా ఉంటే దేవునిదయలేదు అనుకొంటాము. ఇది భక్తుడి లక్షణంకాదు, తెలివిగలవాడి లక్షణం కాదు. మనకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా అంతా దేవునిదయే. ఏది వచ్చినా జరుగుతున్నది, జరిగిపోయినది, జరుగబోయేది అంతా కూడా దేవునిదయే అని నిజంగా గుర్తించినవాడు మాత్రమే నిజమైన భక్తుడు, వాడు మాత్రమే నిజంగా దేవుని ప్రేమించేవాడు అని లతామంగేష్కర్ చెప్పింది.

భగవంతుడి మీద మనకు ఉండవలసినంత ప్రేమగాని, విశ్వాసంగాని మనకు లేదు. ఈశ్వరుడి మీద మనకు నిజంగా ప్రేమ కుదిరితే పెద్ద సాధనతో పనిలేకుండానే మనం ఏదైతే పొందాలి అనుకొంటున్నామో దానిని పొందుతాము, ఒక్క ప్రేమవల్లనే అంతా మనకు లభిస్తుంది. ఆ ప్రేమవలననే మనకు భగవదనుభవం కలుగుతుంది. అందువలన ఈశ్వరుడిపట్ల ప్రేమ, విశ్వాసం ముఖ్యం. డాక్టరు జ్వరం చూడటానికి నాడి పట్టుకొని చూస్తాడు. మోక్షం ఇవ్వటానికి భగవంతుడు మీ హృదయాన్ని చూస్తాడు. మీ హృదయంలో ఏమైనా దోషాలు ఉన్నాయా అని చూస్తాడు. ప్రజలు మీరు చేసే బాహ్యమైన పనిని చూస్తారు. కాని భగవంతుడు ఆ పనిని మీరు ఏ తలంపుతో చేస్తున్నారో చూస్తాడు. మనలో అంతర్యామిగా ఉన్న ఈశ్వరుని మనం మోసం చేయలేము. మీ హృదయంలో ఉన్న సిన్సియారిటీని బట్టి మీకు మోక్షం ఇస్తాడు, శాంతిని ఇస్తాడు. మనం చేసేపని నిండు మనస్సుతో, శాంతితో చేయాలి. ఎంత ధనం ఉన్నా శాంతి లేనివాడికి సుఖం లేదు, శాంతి లేనివాడిని దుఃఖం వెంటాడుతుంది.

మన ఇంట్లో మనం ఉన్నప్పుడు ఎంత ఎండ ఉంటే నీకు ఎందుకు? ఎంత వాన వస్తే నీకు ఎందుకు? ఎంత చలివేస్తే నీకు ఎందుకు? నీకు ఏమి అనిపించదు. అలాగే ఎక్కడైతే ఈశ్వరుడు ఉన్నాడో ఆస్థానంలో నీవు ఉన్నప్పుడు పరిస్థితులు నీకు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా ఒక్కటే. అవి అన్నీ లోకానికి సంబంధించిన విషయాలు, ప్రారబ్ధానికి సంబంధించిన విషయాలు కాని నీకు సంబంధించిన విషయాలు కానే కాదు. నీ హృదయంలో నీవు ఉన్నప్పుడు ప్రారబ్ధం, సంచితం, ఆగామి ఏమీలేదు. హృదయంలో ఉండకుండా మనస్సు బాహ్యానికి వచ్చేస్తూ ఉంటే ఎండబాధ, చలిబాధ, వర్షంబాధ అన్ని బాధలు పడవలసిందే. ప్రారబ్ధం నిన్ను బాధిస్తుంది. అంతాబాధే, ఇవి అన్నీ భావనలే. ఈ భావనలు అన్ని దాటివెళితేనే నీవు సద్భావస్థితిని పొందేది. సంతోషం, దుఃఖం, జన్మలు, చావులు, పుట్టుకలు అన్నీ భావనలే. వీటిని అతిక్రమించి వెళ్ళినప్పుడే నీగూట్లో నీవు పడతావు. నేను దేహమును అనుకొన్నంతకాలం దేవుడు ఉన్నమాట నిజమే. దేహాభిమానం నశించినప్పుడు, నీకు చైతన్యానుభవం కలిగినప్పుడు జగత్తు, జీవుడు, ఈశ్వరుడు వేరుకాదు, ఉన్నది ఒక్కటే అనే సద్భావస్థితిని పొందుతారు. ఆ స్థితిని పొందేవరకు భగవంతునిపాదాలను విడిచిపెట్టకూడదు, భగవంతుని నామాన్ని, రూపాన్ని విడిచిపెట్టకూడదు. ఆ స్థితి ఎప్పుడో వస్తుందని ఇప్పుడు భగవంతుడిని విడిచిపెడితే ఉన్నది ఊడిపోతుంది. మీరు మంత్రం చేసేటప్పుడు విసుగ్గా చేయకూడదు, మనస్సు అక్కడపెట్టి శ్రద్ధగా చేయాలి. అలా చేయటంవలన మీ లక్ష్యం చెదిరిపోదు. మంత్రం విసుగ్గా చేస్తూ ఉంటే దేవుని అగౌరవపరచినట్లు అవుతుంది. నది ప్రవహించేటప్పుడు కొండలమధ్య, గుట్టలమధ్య, అరణ్యాలలో, విశాలమైన మైదానాలలో ప్రవహించి మధ్యలో ఏదైనా ఆటంకాలు వస్తే వాటిని గెంటుకొంటూ వెళ్ళిపోతుంది, సముద్రంలో కలిసేవరకూ దాని ప్రయాణం ఆగదు, దానికి విశ్రాంతిలేదు. అలాగే భగవంతునిలో ఐక్యమయ్యేవరకు జీవుడి యాత్ర సాగుతూ ఉంటుంది. ఇలాంటి శరీరాలు ఎన్నో ధరించాము. ఏదివస్తే అదే నిజం అనుకొంటాము. అదే మాయ. నామాయను ఎవరూ జయించలేరు, నా పాదాలను ఆశ్రయించినవారు మాత్రమే ఈ మాయను జయించగలరు అని పరమాత్మ చెప్పారు. ఈ జగత్తు నిజం అనుకొన్నప్పుడు ఇష్టాలు, అయిష్టాలు గట్టిపడిపోతాయి, జగత్తులో ఏమీలేదు అని నీకు తెలిసినప్పుడు ఇష్టాలు, అయిష్టాలు అన్నీ కరిగిపోతాయి. మన హృదయంలోనికి మనం చేరుకొనేవరకూ స్నేహితుల ప్రభావం, పుస్తకాల ప్రభావం, వాతావరణం యొక్క ప్రభావం ఇలా ఏదో ఒకటి మన మెదడు మీద పడుతూ ఉంటుంది, మన శరీరం మీద పడుతూ ఉంటుంది. మీరు నిజంగా సాధకులుగా ఉండాలంటే, మీకు తత్వచింతన కలగాలంటే, మీకు బ్రహ్మానుభవం కలగాలంటే ఎవరైనా మిమ్మల్ని పొగడినా మీరు పట్టించుకోవద్దు, ఎవరైనా మిమ్మల్ని విమర్శించినా మీరు పట్టించుకోవద్దు. ఈ రెండూ పట్టించుకొన్నారా మీ మనస్సు మీ ఇంటికి వెళ్ళదు, బయటకు వచ్చేస్తుంది. దీనివలన జనన, మరణ ప్రవాహంలో కొట్టుకొని పోతాము.

నాకు ధనం ఉందని, కీర్తి ఉందని ప్రజలు అంటున్నారు, అదికాదు పునర్జన్మ రాకుండా ఉండటానికి ఏరకంగా జీవించాలో ఆరకంగా జీవించటానికి ప్రయత్నం చేస్తున్నాను అన్నారు లతా మంగేష్కర్. జన్మరాహిత్యస్థితిని పొందటానికి ట్రైనింగ్ అవుతున్నాను. నాకు ఏకాగ్రత లేనప్పుడు, నాలో పవిత్రత లేనప్పుడు, నాకు ఈశ్వరుడితో అనుసంధానం లేనప్పుడు లోకం నన్ను గౌరవించినా, గౌరవించకపోయినా నాకు అమృతానుభవం కలుగదు, జన్మరాహిత్య స్థితిని నేను పొందలేను. మనం ఆధ్యాత్మికంగా అభివృద్ధి పొందాలంటే, జీవితంలో వికాశం కలగాలంటే ఆహారం తక్కువ తినాలి, తక్కువ మాట్లాడాలి, తక్కువ నిద్రపోవాలి. ఎవరైతే ఆహారం విషయంలో, మాటల విషయంలో, నిద్రవిషయంలో మితంగా ఉంటున్నారో వారు మరణానంతర జీవితంలో ఉత్తమలోకాలకు వెళతారు, ఇప్పుడు ఈ శరీరంలో ఉండగా శారీరకంగా, మానసికంగా కాంతివంతులవుతారు. అన్నంతినటానికి కంచం

ఉపయోగించుకొంటాము, నిద్ర బాగా పట్టటానికి తలక్రింద దిండు వేసుకొంటాము. చలివేస్తే దుప్పటి కప్పుకొంటాము అలాగే జ్ఞానం సంపాదించుకోవటానికి ఈ దేహమును ఒక పనిముట్టుగా ఉపయోగించుకో. నీ హృదయంలోఉన్న వస్తువు గురించి నీకు తెలియక పోయినా మనస్సు, దేహము నీకు తెలుస్తున్నాయి కదా వాటిని ఉపయోగించుకొని అమృతానుభవం పొందటానికి ప్రయత్నం చెయ్యి. అమృతానుభవం పొందటానికి వాటిని ఉపయోగించుకోకుండా ఈ దేహం స్మశానానికి వెళ్ళిపోతే ఈ దేహం వలన, మనస్సు వలన నీవు ఏమి సాధించినట్లు అంటున్నారు భగవాన్. మానవజన్మ రావటం చాలాకష్టం అందువలన మానవదేహాన్ని నిరుపయోగపర్చుకోవద్దు. మీ కాలాన్ని పాడుచేసుకోవద్దు. నీ పొట్ట పోషించు కోవటానికి కొన్ని గంటలు పనిచేసినా, భగవదనుగ్రహం పొందటానికి కొన్ని గంటలు పనిచెయ్యి. కొన్ని గంటలు ఇతరులకోసం పనిచెయ్యి, దీనివలన మనస్సు పరిశుద్ధమవుతుంది. పరమపవిత్రుడు కానివాడికి పరమాత్మ అనుభవంరాదు. భగవదనుభవం పొందటానికి ప్రహ్లాదుడు చాలా కష్టాలు అనుభవించాడు అని లోకులు చెప్పుకొంటారు. ఆ కష్టాలు అనుభవించేశక్తిని ఇచ్చినవాడు నారాయణుడే కదా అంటాడు ప్రహ్లాదుడు. ఎన్నికష్టాలు వచ్చినా ఇంకా వస్తే బాగుండును అనుకొన్నాను ఎందుచేతనంటే వాటిని అనుభవించేశక్తిని, సమర్థతను, వివేకాన్ని ఇచ్చినవాడు నారాయణుడే కాని ఈ విషయం ప్రజలకు గోచరం కావటంలేదు. శక్తిని ఇచ్చినవాడు నారాయణుడే అన్న విషయం వారికి తెలియటంలేదు అన్నాడు.

రాగద్వేషములు తగ్గించుకోవాలి. ఇష్టం, అయిష్టం ఎక్కువగా ఉంటే మనకు ఈశ్వరుడి మీద ప్రేమతగ్గిపోతుంది. మనకు బయట శత్రువులు లేరు, రాగద్వేషములే మనకు శత్రువులు. నీవు సాధనచేసి, సత్పురుషులతో సహవాసంచేసి, సద్గ్రంథపఠనంచేసి, నీకు తెలిసిన విషయాలను ఇతరుల బాగుకోరి హృదయపూర్వకంగా వారికి చెపుతూ నీలో ఉన్న రాగద్వేషములను తొలగించుకోగలిగితే నీ మనస్సు వెళ్ళి హృదయగుహలో పడిపోతుంది. మీరు అభివృద్ధిపొందటానికి ప్రయత్నంచేస్తూ ఉంటే అనేక అవరోధాలు వస్తూ ఉంటాయి. మీరు మంచిపని చేస్తే అందరూ సంతోషించాలి అనుకోవద్దు. కొంతమంది సంతోషిస్తే, కొంతమంది విరోధులవుతారు. అది లోకంయొక్క పోకడ. లోకం గొడవనీకు వద్దు. నీకు మోక్షం ఇచ్చేది ఈశ్వరుడే, లోకం కాదు. అందువలన ఈశ్వరుని దయను పొందటానికి ప్రయత్నం చెయ్యి. నీవు ఈ భూమిమీదకు ఏపనికోసం వచ్చావో ఆపని పూర్తి చేసుకొని వెళ్ళిపో. నువ్వు పిరికివాడిగా ఉంటే బలోపేతం అవ్వటానికి, ఇప్పుడు నీవు ప్రకృతికి దగ్గరగా ఉన్నావు కాని దేవుడికి దగ్గర అవ్వటానికి ఈ భూమిమీదకు వచ్చావు, దానికి ట్రైనింగ్ పొందు. నీవు భౌతికంగా, మానసికంగా ఎన్ని అవరోధాలు వచ్చినా, నీకు ఎన్ని ఎటాచ్‌మెంట్‌లు ఉన్నా లోపల ఎటాచ్‌మెంట్ లేకుండా ఉండు అని రామకృష్ణుడు చెప్పారు. నీ చేతులు పనిమీద ఉన్నా, నీ మనస్సును దేవుని పాదాల దగ్గర పెట్టు అని భగవంతుడు గీతలో చెప్పాడు.

బ్రతికున్నవారి గురించి వారికి ఇంకా చావురాలేదని ఏడవకండి, చనిపోయిన వారి గురించి వారు ఇంకా ఎక్కువకాలం బ్రతకలేదని ఏడవకండి. జీవించి ఉండగా ప్రేమగా సేవ చేయటం, చనిపోయిన తరువాత నిర్మలంగా, శాంతిగా ఉండటం. చనిపోయిన వారి గురించి సహృదయం కలిగిఉంటే, వారిపట్ల మధురభావాలు కలిగిఉంటే ఆ జీవుడు ఏ లోకంలో ఉన్నా మీ సహృదయాన్ని భగవంతుడు వారికి అందజేస్తాడు. మన ఇంట్లో ఎవరైనా చనిపోతే వారు బ్రతికి ఉండగా ఎప్పుడైనా మనలను ద్వేషించవచ్చు, కొన్ని సందర్భాలలో ప్రేమించి ఉండవచ్చు. మనం ఆ ప్రేమను గుర్తు పెట్టుకోవాలి. ద్వేషాన్ని మర్చిపోవాలి. అప్పుడు చనిపోయిన జీవుడికి మనవలన సహాయసహకారములు అందుతాయి. నీకు బయట ప్రతిబంధకాలు ఉంటాయి, లోపల ప్రతిబంధకాలు ఉంటాయి. ఇవన్నీ తట్టుకొంటేనే నీ ఇంటికి నీవు చేరుకోగలవు. సత్యాన్వేషణలో ఉన్నప్పుడు కూడా ఇంట్లో, వీధిలో శత్రువులు ఉంటారు. వారందరూ నీకు అపకారం చేస్తున్నారు అనుకోవద్దు. నీ మనోబలం పెంచటానికి, నీమీద నీకు విశ్వాసం పెంచటానికి, నీకు ఆత్మనిష్ఠ పెంచటానికి వారికి తెలియకుండావారు నీకు సహాయం చేస్తున్నారు. తలంపులు, కోరికలు, ఇష్టాలు, అయిష్టాలు, వాసనలు వస్తే రానియ్యండి, ఇవి అన్నీ అహంకారానికే. ఆ గడపదాటితే ఏమీలేదు. వీటికి చైతన్యానికి ఇసుమంతయు సంబంధంలేదు. భగవాన్ ఎవరితో అయినా ఆత్మ గురించి చెపుతూ ఉంటే కొంతమందికి అర్థమయ్యేది కాదు. అలా అర్థంకాని వారిని మనం ఏమి చేస్తాము వారి వాసన అంత బలీయంగా ఉన్నది అనేవారు. వారు మంచి వారే కాని వాసన వారికి అర్థం అవ్వనివ్వటం లేదు అని వారి మీద జాలి చూపించేవారు. వాసన ఎవరికి అంటే అహంకారానికే. చైతన్యానికి ఈ గొడవలకు ఏమీ సంబంధంలేదు. ఉన్నది ఒక్కటే అవరోధం. అదే నీ మనస్సు, నీ అహంకారం. మిగతా అవరోధాలు అన్నీ దానికే వస్తాయి. ఆ గడప దాటితే ఏమీలేదు. నీవు ఇంట్లో ఉండి సాధనచేసినా, అడవికి వెళ్ళి సాధనచేసినా, నీవు గృహస్థుడుగా ఉన్నా, సన్యాసిగా

ఉన్నా ఈ మనస్సు అనే గడపను దాటాలి. మీ దేహప్రారబ్దమును బట్టి మీరు ఏ ఆశ్రమంలో ఉన్నా జ్ఞానసముపార్జనకు ప్రయత్నం చేయండి. స్వల్పవిషయాలకు మీ కాలాన్ని పాడుచేసుకోవద్దు. స్వల్ప విషయాలమీద మీ మనస్సు పెడితే మీరు గమ్యాన్ని మర్చిపోతారు. నీవు చేసేపని నీకు అవరోధం కాదు, నేను చేస్తున్నాను అనే తలంపే నీకు అవరోధం. నీకు పనిచేయటానికే అధికారం ఉంది, ఫలితం మీద నీకు అధికారంలేదు. నువ్వు ఆశించినా, ఆశించకపోయినా వచ్చేది ఏదో వస్తుంది. ఆశిస్తే ఎక్కువరాదు, ఆశించకపోతే తక్కువరాదు. ఫలితం వచ్చినప్పుడు పొంగిపోయి, ఫలితం రానప్పుడు కృంగిపోతే దేవుడికి దూరమవుతావు, ప్రకృతికి దగ్గరవుతావు, జననమరణ ప్రవాహంలో కొట్టుకొని పోతావు. నీ చేతిలో ఉన్న పనిని శ్రద్ధగా చెయ్యి. కర్మఫలాన్ని ఆశించవద్దు. కర్మఫలం నీ చేతిలో లేదు అని కర్మమీద విరక్తి పెట్టుకోవద్దు. మనకు ఇప్పుడు 60 సం॥లు వయస్సు అనుకోండి, 5 సం॥లు ఉన్న పిల్లలుగా జీవిస్తే మోక్షం వచ్చేస్తుంది అంటే అమాయకత్వంగా కాదు, చిన్నపిల్లలలో రాగద్వేషములు ఉండవు, అలా రాగద్వేషములు లేకుండా జీవిస్తే మీకు మోక్షం కలుగుతుంది.

ఈశ్వరుడు కర్త అని మీరు అనుకోవటం లేదు, నేనే కర్తను అనుకొంటున్నారు. మీవల్ల ఏదైనా పని అయితే ఈశ్వరసంకల్పంతో ఆ పని అవుతోంది. ఈశ్వరుడు ఏమి చేస్తాడు అంటే మీ వలన ఆ పని అయ్యే యోగం ఉంటే ఆ పనిచేసి గౌరవం మీకు ఇస్తాడు. మీరు అక్కడతోటి తృప్తిపడక పనికూడా నేనే చేసాను అనుకొంటారు. భగవంతుడే కర్త కాని నీవు కర్తను అనుకొంటున్నావు. అందుచేత దుఃఖం నిన్ను వెంటాడుతుంది. మంచినీళ్ళు తీసుకొని రండి అంటే గ్లాసులోపోసి తీసుకొనివస్తారు. మనకు గ్లాసు ముఖ్యంకాదు, మంచినీళ్ళు ముఖ్యం. కాని గ్లాసు లేకుండా మంచినీళ్ళు రావు. అలాగే భగవంతుడు అవతారం ఎత్తినప్పుడు ఒక రూపం ధరిస్తాడు, ఒక నామం పెట్టుకొంటాడు. ఆ నామరూపములు ముఖ్యం కాదు, లోపలఉన్న పదార్థం ముఖ్యం, జ్ఞానం ముఖ్యం. మీరు ఏ పండుగ చేసుకొన్నా చేసుకోకపోయినా గురుపూర్ణిమ తప్పకుండా చేసుకోండి అని షిర్డీబాబా చెప్పేవారు. సూర్యుడు బయటఉన్న చీకటిని పోగొడతాడు, కాని లోపలఉన్న చీకటిని పోగొట్టేవాడు గురువు. మనకు ఎన్ని ఉన్నా ఈశ్వరానుగ్రహం లేనప్పుడు, గురువు అనుగ్రహం లేనప్పుడు ఒకటిలేని సున్నలతో సమానము. మీ దేహప్రారబ్దములో గౌరవం ఉంటే వస్తుంది. మీకు గౌరవం వస్తోంది అని నేను అసూయపడినా దానిని భంగం చేయలేను, నేను అసూయపడే కొలది మీ గౌరవం పెరుగుతుంది. అనవసరంగా ఇటువంటి విషయాలలో మీ మనస్సును పెట్టుకొని వుండు





చేసుకోవద్దు. మనం చేసేపని ఇష్టం, అయిష్టం లేకుండా చేస్తూ ఉంటే మన హృదయం ఖాళీ అవుతుంది. మీరు ఏ కులస్థులైనా, ఏమతస్థులైనా, మీరు ఏరకంగా సాధనచేసినా మీ హృదయంఖాళీఅవ్వకుండా మీకు జ్ఞానం కలుగదు. బ్రహ్మంను తీసుకొనివచ్చి ఒక రూపానికి, ఒక నామానికి పరిమితం చేయకూడదు. ఒక రూపంమీద మీకు గౌరవం ఉంటే మీరు పూజించుకోవచ్చు కాని బ్రహ్మమును ఆ రూపానికే పరిమితం చేయకూడదు. సత్యాన్ని తీసుకొనివచ్చి ఒక రూపానికి, ఒక నామానికి పరిమితం చేసే బుద్ధి మాకు లేదు. ఏ ముఖంలో నుండి మంచిమాట వచ్చినా మేము సంతోషిస్తాము, గౌరవిస్తాము అని చెప్పారు. నీ దేహప్రారబ్దంలో ఉన్నపనిని తప్పించుకోలేవు. నీ ప్రారబ్దంలో ఆ పని లేకపోతే తెచ్చిపెట్టుకోలేవు. నీచేతికి అందని పనిగురించి ఆలోచించవద్దు, నీ చేతిలో ఉన్న పనిని ఇష్టంగా, ప్రేమగా, శాంతిగా, శ్రద్ధగా చేస్తే నీవు శాంతిగా ఉంటావు, ఇతరులు శాంతిగా ఉంటారు. అది నీకు సుఖాన్ని తీసుకొని వస్తుంది, నీకు మోక్షం వచ్చేస్తుంది. నువ్వు పనిలో దెయ్యాన్ని, పిశాచాన్ని చూస్తే నీవు పిశాచివి అవుతావు. అందువలన నీవు పనిలో దెయ్యాన్ని చూడవద్దు, పనిలో దేవుడిని చూడటం నేర్చుకో అప్పుడు దేవుడవు అవుతావు. మనం చేతితో ఇతరులకు సహకారం చేయలేకపోవచ్చు కాని ఇతరులు అభివృద్ధిలోనికి రావాలి, వారు బాగుపడాలి అని కోరుకోవటంలో దారిద్ర్యం పనికిరాదు. మన ఇంట్లో దారిద్ర్యం ఉన్నా, మనస్సులో ఎప్పుడూ దారిద్ర్యం ఉండకూడదు. నీ చేతిలో ఉన్న పనిచేసుకొంటూ మనస్సును మాత్రం ఈశ్వర అన్వేషణలో ఉంచు.

ఎవరైనా ఏదైనా చెపుతున్నారు అనుకో మంచిని తీసుకో, చెడును విడిచిపెట్టు, జ్ఞానాన్ని తీసుకో అజ్ఞానాన్ని విడిచిపెట్టు. మీరు చెడుమాటలు తీసుకొంటున్నారు అనుకోండి మీ లోపల చెడు ఉంది అని అర్థం. మీ లోపల మంచి ఉంటే మంచి మాటలు తీసుకొంటారు. బయట ఏమీలేదు అంతా మీ లోపలే ఉంది అని చెప్పటంకోసం భాగవతంలో ఇలా చెప్పాడు. మీరు విన్నది సైలెంట్‌గా వినండి, విడిచిపెట్టేది సైలెంట్‌గా విడిచిపెట్టండి, లోపలకు తీసుకొనేది కూడా సైలెంట్‌గా తీసుకోండి ఇది బాగుపడే వాడి లక్షణం, ఇలా చేసేవాడు భగవంతుడిలో భాగం అవుతాడు. అందరి హృదయాలలో ఈశ్వరుడు అంతర్యామిగా ఉన్నాడు. అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడిని అన్ని విధములుగా మినహాయింపులు లేకుండా శరణు వేడుకో. ఈశ్వరుడు అందరి హృదయాలలో ఉన్నాడు. నిర్మలంగా, నిశ్చలంగా ఉన్నాడు. జీవకోటిని అంతా

నియమిస్తున్నాడు, ఆడంబరం లేకుండా పనిచేస్తున్నాడు. సర్వ విధములుగా ఆయనను ఆశ్రయించు. దానివలన నీవు ఈశ్వరస్వరూపమును పొందుతావు, శాశ్వతశాంతిని పొందుతావు. గతి అల్లా శరణాగతే. నీవు మోక్షం పొందటానికి యుద్ధం అనేది గేటు లాంటిది అర్జునా! అందువలన నీవు చేసేపని అయిష్టంగా చెయ్యవద్దు, ఇష్టంగా చెయ్యి. ఈశ్వరుడు వీరినందరినీ చంపేఉంచాడు, ఈశ్వరసంకల్పాన్ని నెరవేర్చటానికి నీ శరీరాన్ని ఉపయోగించుకొంటున్నాడు, నువ్వు పనిముట్టు మాత్రమే అని పరమాత్మ అర్జునుడితో చెప్పాడు. కొంతమందికి శరీరం ఒకచోట, మనస్సు ఒకచోట ఉంటుంది. శరీరం ఎక్కడ ఉంటే మనస్సు అక్కడ ఉండాలి. నువ్వు ఏపని చేసినా ఏకాగ్రంగా చెయ్యి, నిండు మనస్సుతో చెయ్యి. అన్ని రూపములు, అన్ని నామములు భగవంతుడివే అనుకొంటే ఇంక మనం మాయలో పడము, మోహంలో పడే అవకాశం లేదు. మనం కష్టపడి సాధనచేసి రాగద్వేషములనుండి విడుదల పొందాలి. కాని మనం ఎంత సాధనచేసినా రాగద్వేషములనుండి బయటకు రాలేకపోతున్నాము అందువలన మనకు స్వేచ్ఛలేదు, శాంతిలేదు, జ్ఞానంలేదు. మీరు అందరూ భగవంతుడికి తెలియకుండా ఈ లోకంలో పుట్టలేదు, భగవంతుడికి తెలియకుండా మీరు చనిపోరు. మీ జీవితంలో సుఖం వచ్చినా, కష్టం వచ్చినా, శాంతి వచ్చినా, అశాంతి వచ్చినా అది భగవంతుడికి తెలియకుండా రావటంలేదు. అంతా భగవంతుడికి తెలిసే జరుగుతున్నాయి. భగవంతుడికి తెలియకుండా మీ జీవితంలో ఏదీ జరుగదు. నీ దేహప్రారబ్ధంలో భగవంతుడు ఏపని అయితే ఇచ్చాడో ఆపనిని హితవుగా, ప్రేమగా చెయ్యి. అదికూడా సాధనే. దానివలన పాతవాసనలు నశిస్తాయి, కొత్త వాసనలు రావు. ధ్యానం వలన ఏ ఫలితం వస్తుందో నీవు ప్రేమగా, హితవుగా పనిచేయటం వలన కూడా అదే ఫలితం వస్తుంది. నువ్వు చేసే పని శ్రద్ధగా చేస్తే నీ మనస్సు నిర్మలం అవుతుంది, నిశ్చలం అవుతుంది. మీరందరూ నా మీద ప్రేమ చూపిస్తున్నారు, మీ ప్రేమను జ్ఞాపకం పెట్టుకొంటూ నా శరీరాన్ని విడిచిపెడితే సరిపోతుంది. ఒకవేళ మీలో ఎవరైనా నన్ను ద్వేషిస్తున్నా, ఆ ద్వేషాన్ని నేను మర్చిపోయి నా పట్ల మీకు ఉన్న ప్రేమను జ్ఞాపకం పెట్టుకొంటే నా జీవితం ధన్యమవుతుంది. మీలో ఎవరైనా నన్ను ద్వేషిస్తూ ఉంటే ఆ ద్వేషాన్ని మర్చిపోయే శక్తిని ఇమ్మని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. ప్రహ్లాదుడికి ఆ శక్తిని ఇచ్చాడు బహుశా నాకు ఆ శక్తిని ఇవ్వబోతున్నాడేమో ఈశ్వరుడు. అందరూ ఈ భూమి మీదకు ఒకరోజు రాలేదు. అందరూ ఈ భూమిని విడిచిపెట్టి బయటకు ఒకరోజు వెళ్లరు. ఎవరి పద్ధతిలో వారు వెళ్లిపోతారు. కాని నేను భగవంతుడిని ప్రార్థించేది ఏమిటి అంటే నా పట్ల మీకు ఉన్న ప్రేమను,

**20-07-2002**



నాపట్ల మీకున్న ఆప్యాయతను నేను సదా జ్ఞాపకం ఉంచుకొనేటట్లు ఈశ్వరుడు చేస్తే అదే చాలు. మనం శాంతిగా ఉన్నప్పుడు మంచి విషయాలు స్ఫురిస్తాయి, అశాంతిగా ఉన్నప్పుడు మంచి విషయాలు స్ఫురించవు. మీరు ఏదైనా ముఖ్యమైన విషయం ఆలోచించాలి అనుకోండి ఆందోళనగా ఉన్నప్పుడు, అశాంతిగా ఉన్నప్పుడు ఆలోచించవద్దు. మీరు శాంతిగా ఉన్నప్పుడు ఆలోచించండి. అన్నీ మంచి నిర్ణయాలు వస్తాయి. భౌతికంగాను, ఆధ్యాత్మికంగాను అభివృద్ధిలోనికి వస్తారు, శరీరం ఉండగా సుఖపడతారు, మరణానంతరం సుఖపడతారు. అప్పుడు ఎటుచూసినా సుఖమే, ఎటుచూసినా ఆనందమే.

బుద్ధదేవుని భూతదయను, పునరుద్ధరింపంగ
పుడమిపై వెలసె శ్రీ నాన్న దేహంబునున్
పరమపుణ్యంబు పండంగవారలు
పరుగు పరుగున వచ్చు ఆ పరమాత్మ
శ్రీనాన్న చెరణంబుల చెంతకున్
నీచ గుణంములెల్ల నిర్మూలమైపోవు
వారి సుజనగోష్టి వలన
లోచూపునేర్పును లోక కళ్యాణమునకున్
పరగతిని చూపు - పరి పరి విధములగా
కాపుకాచుచు అనవరతమున భక్తులను
పయనింపచేయును - పరమపదమునకు
పుష్పక విమానము పైనన్
పావనమూర్తి - పరమాత్మ
శ్రీ నాన్న సద్గురు దేవుడున్

**సాగిరాజు రామకృష్ణంరాజు**
అర్ధవరం

# రమణభాస్కర

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 14-07-2002, గుమ్మలూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భగవదనుభవం పొందటానికి ఎప్పుడూ ఇలాగే కృషిచేయాలా, సాధనచేస్తూ ఉండాలా అని మీరు అనుకోవచ్చు. ప్రారంభంలో కొంతవరకే మీరు కృషి చేయాలి. మీ మనస్సుకు అంతర్దృష్టికలిగాక, హృదయంలోనికి కొంత లోపలకు వెళ్లినతరువాత అప్పుడు కృషితో పనిలేకుండా సహజంగానే ప్రయాణం సాగిపోతుంది, సాధన నార్మల్‌గా జరిగిపోతుంది. మోక్షాన్ని పొందాలనే కాంక్ష మనకు బలీయంగా ఉండాలి, మోక్షప్రదాత అయిన ఈశ్వరుడు ఉన్నాడు అనే సజీవమైన విశ్వాసం మనకు ఉండాలి. విశ్వాసంలో లోపం పనికిరాదు. మనం ఇతరులతో కాదు పోరాడటం, మనలో ఉన్న అవిశ్వాసంతో పోరాడాలి. ఈశ్వరానుగ్రహం పొందటంకోసం సత్కర్మ చేయండి. సత్కర్మ చేయటంవలన మనలో ఏమైనా లోపాలు ఉంటే అవి నశిస్తాయి. సాధన అంటే ఏమీలేదు మనం ఏదైతే నేను నేను, నాది నాది అంటున్నామో ఆ నేను, నాది నిజం కాదని తెలుసుకోవటమే సాధన యొక్క లక్ష్యం. ఇప్పుడు మనం ఏదైతే నేను నేను అంటున్నామో ఆ నేను ఎంత నిజమో, ఆనేను కల్పించిన బంధువులు, స్నేహితులు, విరోధులు కూడా అంతే నిజం. మీకు ఇష్టం ఉన్నా, లేకపోయినా ఇది అంగీకరించి తీరాలి. ఇది ముందు మనకు అర్థమయితే మన మనస్సు చల్లబడుతుంది. దేనిగురించి మనం ఆందోళన పడవలసిన అవసరం లేదు. రాగద్వేషాలు ఉన్నవాడు అహంభావరహితస్థితిని పొందలేడు. రాగద్వేషముల నుండి విడుదల పొందినవాడు మాత్రమే అహంభావరహిత స్థితిని పొందుతాడు. అహంభావరహిత స్థితిని పొందినవాడికి కాని అమృతానుభవం కలుగదు. అమృతానుభవం పొందినవాడు కాని జననమరణ ప్రవాహంలోనుండి విడుదల పొందలేడు. మనం చిన్న చిన్న పనులు కూడా పెద్ద మనస్సుతో చేయాలి. శరీరానికి అనారోగ్యం ఉన్నా ఇంట్లో దారిద్ర్యం ఉన్నా మనస్సులో దారిద్ర్యం లేకుండా చూసుకోవాలి. మనస్సులో సంపద ఉంటే వాడికి ఈశ్వరసాక్షాత్కారం కలుగుతుంది. మనం సాధకులం అనుకొంటున్నాము కాని కాలక్షేపంసంఘం క్రింద తయారవుతున్నాము. కోటిమందిలో ఎవడో ఒకడు సాధన చేస్తాడు, అలా సాధనచేసే కోటిమందిలో ఎవడో ఒకడు తరిస్తాడు. నా మాయను ఎవరూ జయించలేరు. నా పాదాలను ఆశ్రయించినవాడు, సర్వం నేనే అని తన్నుతాను పోగొట్టుకున్న వాడికి నేను తెలియబడతాను అని భగవంతుడు చెప్పాడు. మనలను మనం పోగొట్టుకోవటానికి సిద్ధంగాలేము



5A

ఇంక భగవంతుడు ఏమి తెలియబడతాడు. మాయ ఎక్కడో ఉంది అనుకొంటున్నాము, మన మనస్సే మాయ, సుఖం కావాలనుకోవటం మాయ, దుఃఖం వద్దనుకోవటం మాయ, మాయ యొక్క స్వరూపం అర్థం చేసుకోవటం చాలా కష్టం. ఈశ్వర కటాక్షం పొందిన వాడికికాని మాయ యొక్క చేష్టలు ఎలా ఉంటాయో తెలియదు. మనస్సు వేరు, ఆత్మ వేరు. మనం మనస్సు యొక్క పరిధిలో ఉన్నాము. మనస్సు యొక్క వలయంలో నుండి విడుదల పొందితేగాని అమృతానుభవం కలుగదు. మీకు 100 కోర్కెలు ఉన్నాయి అనుకోండి, 99 కోర్కెలు జయించి, ఒక్క కోరిక ఉండిపోయింది అనుకోండి, ఆ ఒక్క కోరిక తిరిగి జన్మను తీసుకొని వస్తుంది. దీనినిబట్టి మాయను జయించటం ఎంత కష్టమో ఆలోచించండి. దైనందిన జీవితంలో దేహాభిమానాన్ని ఎంతవరకు తగ్గించుకొంటున్నావో చూసుకో, మనస్సు బాహ్యముఖం అవుతూ ఉంటే వాసనలు పెరుగుతాయి. మనస్సుకులోచూపు కలుగుతూఉంటే, హృదయంలో ఉన్న అంతర్యామి దగ్గరకు జరుగుతూ ఉంటే వాసనలు నశిస్తాయి.

గడ్డితాడులో ఉన్న గడ్డిపరకలు తీసివేస్తే ఇంకతాడు ఉండదు అలాగే నీ మనస్సులో ఉన్న కోరికలు, ఇష్టాలు, అయిష్టాలు అన్నీ తీసివేస్తే మనస్సు ఉండదు. ఇంట్లో పనిఉన్నప్పుడు పనిచేసుకోవాలి. పనిలేనప్పుడు జపమో, ధ్యానమో చేసుకోవాలి అంతేగాని కాలం పాడు చేసుకోవద్దు. నువ్వు ఏ పనిచేసినా ఈశ్వరార్పితంగా చేయాలి. ఏదైనా వస్తువును ఇతరులకు ఇస్తున్నా ఈశ్వరార్పణబుద్ధితో ఇవ్వాలి. ఈశ్వరార్పణబుద్ధితో చేస్తున్నాము అని మనం అనుకొంటున్నాముగాని ఈశ్వరార్పణబుద్ధితో చేయటంలేదు, అహంకారబుద్ధితో చేస్తున్నాము. అంతా మోసమే. మనలను మనం మోసం చేసుకొంటున్నాము. భగవంతుడికి తెలియకుండా మనం చిన్న పని కూడా చేయలేము. మనలో అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడిని మనం మోసం చేయలేము. వ్యక్తిభావనతో పనిచేయవద్దు, నీ కోరికను సాటిస్‌ఫై చేయటం కోసం పనిచేయవద్దు. ఈశ్వరార్పణబుద్ధితో పనిచెయ్యి. ఈశ్వరార్పణబుద్ధితో పనిచేయగా, చేయగా అప్పుడు చిత్తశుద్ధి కలుగుతుంది. ఎప్పుడైతే చిత్తశుద్ధి కలిగిందో, ఏకాగ్రత కలిగిందో, పవిత్రత వచ్చిందో అదే సమాధిస్థితిని తెచ్చిపెడుతుంది. కొంతమంది పదినిమిషాలు పూజ చేసుకొంటారు బయటకు వచ్చి ఊళ్ళో గొడవ అంతా నెత్తిని వేసుకొంటారు. అంటే వారికి భక్తి పెరగదు, ఉన్న భక్తి ఊడిపోతుంది. మనం చేసే సాధన అంతా ఉన్న భక్తిని ఊడగొట్టుకోవటం కోసం కాదు, ఉన్న భక్తిని పెంచుకోవటం కోసం. మీకున్న భక్తి నిజమైతే

వాసవా క్షయం అవ్వటానికి ఆ భక్తిచాలు. గజేంద్రుడు యొక్క భక్తివల్లే మహావిష్ణువు ఆయనను రక్షించాడు, మోక్షాన్ని ఇచ్చాడు. ఇది ధనం వలన, కీర్తివలన, చదువు వలన, బాహ్య ప్రక్రియల వలన వచ్చేది కాదు.

నీకు ఆందోళనగా ఉంది అనుకో. ఈ ఆందోళన పడే నేను ఎవరు? అని ప్రశ్నించు. నీకు భయం వస్తోంది అనుకో, భయపడే ఈ నేను ఎవరు? అని ప్రశ్నించు. ఇలా ప్రశ్నించటం వలన అది దానిమూలంలోనికి జారుతూఉంటుంది. అప్పుడు ఇతర తలంపులు తగ్గుతూ ఉంటాయి. మొదటితలంపును విచారణచేయటం వలన అది బాహ్యముఖానికి వెళ్లటం మానివేసి, అంతర్ముఖం అయ్యి హృదయంలోనికి వెళ్లి లయమవుతుంది, అప్పుడు ఆత్మానుభవం కలుగుతుంది. జగత్తు, జీవుడు, ఈశ్వరుడు ఒక్కటే కాని మనకు మూడు క్రింద కనిపిస్తోంది. మూడు నిజంకాదు, నిజంవలె మనకు కనిపిస్తోంది. దేహమునేను అనే బుద్ధి ఉన్నంతవరకు ఒకటి మూడు క్రింద కనిపిస్తుంది. ఆ బుద్ధి నశించాక ఉన్నది ఒక్కటే. తెలిస్తే ఒకటి, తెలియకపోతే మూడు. తెలిస్తే సుఖం, తెలియకపోతే దుఃఖం. ఎవరితోనైనా నీ మనస్సు మాట్లాడవద్దు అని చెపితే నీవు మాట్లాడు అప్పుడు మనస్సు నశిస్తుంది. అది చెప్పినట్లు వింటే మాయ పెరిగిపోతుంది. మాయ అంతా మనస్సులోనే ఉంది. మనస్సు అనే గడప దాటితే అవధులు లేని ఆనందంలో ఊగిసలాడతావు. మన మనస్సు ఎక్కువగా శిరస్సులో ఉంటుంది. మనస్సు అణిగేకొలది హృదయంలో ఉండటానికి అలవాటు అయిపోతుంది. మనస్సును హృదయంలో ఎక్కువసేపు ఉంచటానికి ప్రయత్నం చెయ్యి. దానిని ఎక్కువ హృదయంలో ఉంచాలంటే సత్వగుణం అభివృద్ధి చేసుకోవాలి. ఏవిద్య వలన అవిద్యలోనుండి బయటకు వస్తామో అదే నిజమైనవిద్య, ఏ జ్ఞానం వలన అజ్ఞానంలోనుండి బయటకు వస్తామో అది నిజమైన జ్ఞానం. మనస్సును హృదయంలో ఉంచగలనా, లేదా అని సందేహం పెట్టుకోవద్దు. నీ మీద నీకు ఉన్న విశ్వాసం పోగొట్టుకోవద్దు. ప్రయత్నం చెయ్యి, ఈశ్వరానుగ్రహం వలన నీవు తరిస్తావు. లోపల హృదయంలో ఈశ్వరుడు అంతర్యామిగా ఉన్నాడు కదా వాడిచెంత ఉండటం నేర్చుకో. సహజంగా మనస్సు ఏదో ఒకరోజు నశిస్తుంది. మనస్సు నశిస్తే నీవు నశించవు, నీవు ఎవరో నీకు తెలియబడుతుంది.

మంచి విషయాలు విని ఉంటే, మంచి గ్రంథాలు చదివితే, మంచివారితో స్నేహంచేస్తే దాని ప్రభావం ఏదో ఒక రోజు మనకు ఉపయోగపడుతుంది. నిన్ను కోరికలు, తలంపులు, విషయాలు ఎంతకాలం అయితే బాధ పెడుతున్నాయో అంతకాలం నేను, నేను అని చెప్పే

**20-07-2002**



ఈనేను ఎవరు? అని విచారణ విడిచిపెట్టకూడదు. అవి బాధపెట్టటం మాననప్పుడు మనం విచారణ ఎందుకు మానాలి. యోగం అంటే నీకు ఇష్టమైన వాడిని, ఇష్టంలేనివాడిని సమానంగా చూడగలగటమే యోగం, అందరిని సమానంగా చూడగలగాలి. నీకు నిజంగా వైరాగ్యం ఉంటే ఆత్మచింతన తప్పించి ఇతర చింతనలు రానేరావు, నీ దృష్టి ఆత్మమీదే ఉంటుంది గాని విషయాల మీద ఉండదు. ఆత్మబుద్ధి అమృతం, విషయబుద్ధి విషం వంటిది. ఆత్మచింతన తప్పించి ఇతరచింతనలు వస్తున్నాయి అనుకో ఆ తలంపును ఉదయించిన చోటనే ధ్వంసం చెయ్యి. విషయచింతన లేకుండా ఉండటం వైరాగ్యం, ఆత్మచింతనను విడిచిపెట్టకుండా ఉండటం జ్ఞానం, ఏద్తెనా ఒక్కటే. మీ మనస్సును మీరు తొందరగా నమ్మవద్దు. అది అణిగినట్లు నటిస్తుందిగాని అణగదు, అది వేరుతో సహా నశించే వరకూ అభ్యాస, వైరాగ్యములు విడిచిపెట్టవద్దు. నువ్వు ఎవరో నీకు తెలిసేవరకూ ఆత్మచింతన విడిచిపెట్టవద్దు, అజాగ్రత్త పనికిరాదు. మీరు ఉదయం మొదలు సాయంత్రం వరకు ఎన్ని గంటలు జాగ్రత్తగా ఉంటున్నాము, ఎన్ని గంటలు అజాగ్రత్తగా ఉంటున్నాము అనేది చూసుకోండి. ఒక గంట జాగ్రత్తగా ఉండి, 4 గంటలు అజాగ్రత్తగా ఉంటే నువ్వు జీవించినది ఒక గంట మాత్రమే, నువ్వు అజాగ్రత్తగా జీవించిన గంటలు అన్నీ బూడిదపాలు, టైము వేస్టు, ఎనర్జీ వేస్టు. నువ్వు ఎంతకాలం అయితే జాగ్రత్తగా జీవిస్తున్నావో అంతకాలం జీవించినట్లు, మిగతాది సున్న. మీ పాదాలు భూమి మీద ఉంచండి, గాలిలో మేడలు కట్టవద్దు. చెప్పేవాడికి ముందు సబ్జక్టు పట్ల అవగాహన ఉండాలి, స్పష్టత ఉండాలి. సబ్జక్టు నీకే తెలియనప్పుడు వినేవాడికి ఎలా చెప్పగలవు. వినేవాడి మీద నీకు ప్రేమలేనప్పుడు వాడికి అర్థమయ్యేవరకు ఎలా చెప్పగలవు. వినేవాడి ఆలోచన చంపకూడదు, వాడి ఆలోచన పెంచాలి. వారి చైతన్యస్థాయి పెంచాలిగాని వారిని మొద్దబ్బాయిలుగా తయారు చేయకూడదు.

నీవు కానిదానిలో నుండి విడుదల అయ్యేవరకు నేను ఎవడను అనే విచారణ విడిచిపెట్టవద్దు, ఆత్మవిచారణ విడిచిపెట్టవద్దు. ఈ విచారణ చేయటానికి, భగవంతుని పాదాలను ఆశ్రయించటానికి ఇల్లు విడిచిపెట్టి ఎక్కడికి పారిపోవద్దు. పని అంటే భయంతో పనిని విడిచిపెట్టవద్దు. భయంవలన ఏ పని చేయవద్దు. ఎవరికైనా సహాయం చేయాలంటే చేయండి కాని భయంవలన చెయ్యవద్దు. నీకు సబ్జక్టు చెప్పాలంటే చెప్ప వారు ఏమనుకొంటారో అనే భయం వలన సబ్జక్టు చెప్పవద్దు. చేసేది నిండు మనస్సుతో చెయ్యి, హృదయ పూర్వకంగా చెయ్యి, ఈశ్వరార్పణ బుద్ధితో చెయ్యి అంతేగాని భయంవలన చెయ్యవద్దు.

**రమణ భాస్కర**

భయం వలన పని చేయటం మంచిదికాదు దానివలన నీ మనస్సు బాహ్యాముఖానికి వెళుతుంది గాని దానికి లోచూపు రాదు. మనం చేస్తున్నపని ఆధ్యాత్మిక పురోగతికి సహకరించేలా ఉండాలి. మనం పని దొంగలు కాకూడదు, పనివల్ల కూడా మనం తరించవచ్చు. నువ్వు మనస్సును ఎక్కడ ఉంచాలో అక్కడ ఉంచి విచారణ చేస్తూ ఉంటే చేతులు పనిచేసినా విచారణకు అడ్డురాదు. మనస్సుతో జపించు, ధ్యానించు, విచారణ చెయ్యి, చేతులతో పని చేసుకో. ఇలా పనిచేస్తూ ఉంటే నీకు పనిలోకూడా ధ్యానస్థితి కలుగుతుంది. పనికూడా పూజ అయిపోతుంది. పనిలోకూడా దేవుని చూడటం అలవాటు అయిపోతుంది. మనం ఎప్పుడూ లోపల బలం పెంచుకోవాలి, బయటకు మామూలుగా ఉండాలి. లోపల భక్తి ఉండాలి అది బయటకు తెలియకూడదు. ఇతరులకంటే మనలో ఏదో ప్రత్యేకత ఉందనే భావన కలుగకూడదు. మనకు భక్తి ఉందని ఇతరులకు తెలియాలి అనుకోవటం మహాదోషం, దానివలన అహంభావన పెరుగుతుంది. నీవు చేస్తున్న సాధన నిజమైతే, నీభక్తి నిజమైతే బయట వ్యక్తులపట్ల, స్నేహితుల పట్ల, విరోధులపట్ల సమాజం పట్ల, ప్రకృతిపట్ల, సంఘటనల పట్ల అన్నింటిపట్ల నీ దృక్పదం మారిపోతుంది. నీ సాధన నిజమైతే పూర్వ దృక్పదం ఉండదు, నవీన దృక్పదం వస్తుంది. ఆచార్యులవారు ఏమి చెప్పారు అంటే నీవు తాడును చూసి పాము అనుకొంటే ప్రమాదంలేదు నీకు భయం వేస్తుంది అంతే. కాని పామును చూసి తాడు అనుకొంటే ప్రమాదంలో పడతావు, అది కాటేస్తుంది నీ ప్రాణం తీస్తుంది. పామును చూసితాడు అనుకోవటం ఎటువంటిదో ఈశవాన్ని చూసి ఇదే ఆత్మ అనుకోవటం కూడా అటువంటిదే, దీనివలన ప్రమాదంలో పడతావు నీ కొంప మునుగుతుంది సుమా, అందువలన బహుజాగ్రత్తగా ఉండు అని చెప్పారు. జ్ఞాని అమనస్కస్థితిని పొంది ఉంటాడు, మనస్సు యొక్క ప్రభావం ఏమీ ఆయనమీద పడదు. జ్ఞానం కలిగిన తరువాత నువ్వు పని చేయవు, నీ ద్వారా పని జరుగుతుంది. జ్ఞానికి సంకల్ప, వికల్పాలు ఉండవు. జ్ఞాని ఈశ్వరుని చేతిలో పని ముట్టు క్రింద ఉంటాడు. ఈశ్వరుడు ఆ శరీరాన్ని ఎలా వాడుకోవాలో అలా వాడుకొంటాడు, ఆ శరీరం ద్వారా ఏది జరగాలో అది జరుగుతూ ఉంటుంది. శరీరం ద్వారా పనిజరిగినా, పని జరగకపోయినా జ్ఞానమే. జ్ఞాని ఏమిచేసినా మాట్లాడినా, కూర్చున్నా, నడిచినా, మౌనంగా ఉన్నా అంతా జ్ఞానమే, అంతా మధురమే. ఆయన మందలింపు కూడా మధురమే. మన దురదృష్టం ఎక్కడ ఉంది అంటే రాగద్వేషములతో మన జీవితాన్ని ఖర్చుపెట్టుకొంటున్నాము. రాగద్వేషముల వలన మనకు ఏమీ కలిసిరాదు, చివరకు అనారోగ్యం వస్తుంది. మనకాళ్ల మీద మనం నిలబడలేక, మనం ఎవరిమో మనం తెలుసుకోలేక ఎదుటివారి మాటలమీద, పనులమీద ఆధారపడి జీవిస్తున్నాము. మీకు సబ్జక్టుపట్ల అవగాహన లేనప్పుడు మిగిలేది తిప్పలు. బయట ఏది జరిగినా నువ్వు నిర్వికారంగా ఉండవచ్చు, ఎందుచేతనంటే నీలోపల జ్ఞానగంగ ఉంది. అది నీకు అనుభవంలోనికి వచ్చినప్పడు బయట సంఘటనలుగాని, బయట వ్యక్తులుగాని, బయట పరిస్థితులుగాని దేని ప్రభావం కూడా నీ మీద ఉండదు. నువ్వు ఎవరో నీకు తెలిసే వరకూ నీ మనస్సు కుదురుగా ఉండదు, ఏదో గొడవలు తీసుకొని వస్తుంది. నిజమైనగురువు ఆ సపోర్టులను ఊడగొడతాడు. అబద్దమైనగురువు ఆ సపోర్టులను పెంచుతాడు. ఆ సపోర్టులను పెంచే గురువు గొప్పగురువు అని మనం అనుకొంటున్నాము, మరణానంతరం మనకు చీకటిలోకాలు మిగులుతాయి. మనకు ఎప్పడైనా దుఃఖం వచ్చినప్పడు, రజోగుణంలో ఉన్నప్పడు ఈశ్వరుడు మనలను విడిచిపెట్టేసాడు అనిపిస్తుంది. ఆయన ఆలింగనంలోనికి తీసుకొని ముద్దు పెట్టుకోవటానికే ఒకోసారి విడిచిపెట్టేస్తాడు, మన మీద కోపంతోకాదు. గురువు ఆగ్రహం కూడా అనుగ్రహమే అని గుర్తించిన వాడు ధన్యుడు. మనిషికి వెలితి ఎక్కడ ఉంది అంటే వారు వారుగా ఉండలేకపోతున్నారు. వాళ్ళు వాళ్ళుగా ఉండలేక ఎక్కడికో ఒకచోటికి వెళ్ళిపడిపోతున్నారు. గురువులు తాచుపాములాంటివారు. తాచుపాము నోటిలో పడ్డ కప్ప బయటకురాదు మింగేస్తుంది, అలాగే గరువు మనలను మింగేస్తాడు అంటే మీ అహంకారాన్ని తీసుకొంటాడు, ఆయన స్వరూపాన్ని మీకు ఇస్తాడు. మీ దగ్గర పుచ్చుకొనేది ఎందుకు పనికిరానిది, ఆయన ఇచ్చేది మాత్రం బంగారం. సత్పురుషుల సహవాసంలో 100కి 99 మంచి ఉన్నా ఒక చెడ్డకూడా ఉంది, విడిపోయేటప్పడు ఎంతో కొంత దుఃఖానికి సంబంధించిన తలంపు ఉంటుంది. దుఃఖం వస్తే రానివ్వండి. చంద్రుడికి కూడా ఒక మచ్చ ఉంది కాని చంద్రుడులోనుండి వచ్చే కాంతినిగాని, వెన్నెలనుగాని ఆ మచ్చ ఆపలేకపోతోంది. మనకు 99 మంచిపాయింట్లు ఉన్నప్పడు ఏదో ఒక మైనస్ పాయింటు ఉన్నా, దుఃఖానికి సంబంధించిన తలంపు ఉన్నా ఆ మైనస్ పాయింటును మనం వదిలివేద్దాము. మనం ఆరోగ్యంగా ఉండటానికి, మనం బాగుపడటానికి శాంతి అవసరం. మనం శ్రద్ధగా పనిచేసుకోవటానికి, చదివినది అర్ధం చేసుకోవటానికి శాంతి అవసరం. మన ఇంట్లో, సమాజంలో రకరకాల మనుషులు ఉంటారు. వారితో కలిసిమెలిసి ఎలా జీవించాలో శాంతి మనకు నేర్పుతుంది. మన చైతన్యస్థాయిని పెంచుకోవటానికి, మోక్షం పొందటానికి శాంతి అవసరం.

**20-07-2002**

**రమణ భాస్కర**

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| 24-7-2002 | బుధవారం | జిన్నూరు శ్రీ రమణ క్షేత్రం, గురుపౌర్ణమి మహోత్సవం |
| 5-8-02 నుండి 13-8-02 | | అరుణాచలం కేంపు |
| 16-8-02 నుండి 22-8-02 | | హైదరాబాదు కేంపు |
| 18-8-2002 | ఆదివారం | హైదరాబాద్ చిక్కడపల్లి త్యాగరాజ భవనము నందు |

## గురుపౌర్ణమి మహోత్సవ కార్యక్రమం (జిన్నూరు)

ఉ॥ గం॥ 6-00ల నుండి 12 గం॥ల వరకు

**సద్గురు దర్శనం**

ఉ॥ గం॥ 8-00లకు

**శ్రీ రమణ క్షేత్రంలో భగవాన్ పూజ**

మ॥ గం॥ 12-00లకు

**సద్గురు శ్రీ నాన్నగారు శ్రీరమణ క్షేత్రంకు విచ్చేయుదురు**

మ॥ గం॥ 2-00లకు

**శ్రీ కె.యస్.యన్. రాజు(హైదరాబాదు) దంపతులచే గురుపూజ**

మ॥ గం॥ 2-30లకు

**సద్గురు అనుగ్రహభాషణములు**

**గమనిక**

ఉ॥ గం॥ 10-00నుండి మ॥ గం॥ 12-00వరకు భోజన సదుపాయం కలదు

## పాఠకులకు మనవి....

## రమణ భాస్కర సంవత్సర చందా రు. 150/-

## అయిదు సంవత్సరముల చందా రు. 700/-

సద్గురు శ్రీ నాన్నగారి ప్రవచనాలను అందించటానికి మేము చేస్తున్న కృషిని ప్రోత్సహిస్తున్న పాఠకులకు ధన్యవాదములు. రమణ భాస్కర ఆధ్యాత్మిక పక్షపత్రిక సంవత్సర చందా రు. 150/-లు, అయిదు సంవత్సరముల చందా రు. 700/-లు గా నిర్ణయించడమైనది. మీరు చెల్లించిన సంవత్సర చందాకు ది॥ 23-9-2002 నుండి ది॥ 23-9-2003 వరకు క్రమం తప్పకుండా ముద్రించిన పత్రికలు అందుతాయి. గమనించగలరు. మీరు యం.ఓ / డి.డి. / నగదు రూపంగా పంపించవలసిన చిరునామా.

**పెన్మెత్స శ్రీరామరాజు**

**("రమణభాస్కర" కొరకు)**

**శ్రీరమణ క్షేత్రం, జిన్నూరు - 534 265**

**ప॥గో॥జిల్లా, ఆంధ్రప్రదేశ్**

### కూపన్

ఎడిటర్ గారికి,

నేను రమణభాస్కర సంవత్సర చందా నిమిత్తం రూ॥ 150/-లు (అక్షరాలా నూటయాబది రూపాయలు మాత్రమే) యం.ఓ. / డి.డి. / నగదు పంపించుచున్నాను. క్రమం తప్పకుండా ప్రతులు పంపించగలరు. (ది. 23-9-2002 నుండి 22-9-2003) వరకు.

పేరు ..........................................................................................

తండ్రి / భర్త ..........................................................................................

డోర్ నెం. .................................... వీధి / రోడ్ పేరు....................................

గ్రామం .................................................... పిన్ కోడ్ ....................

మండలం .................................................... జిల్లా....................................

డి.డి. / యమ్.ఓ./నగదు వివరాలు ...................................... ఫోన్ నెం....................